

పైసల ముచ్చట్లు

# నయా సాల్.. నయా దౌర్!

*కొత్త ఏడాది ప్రవేశించి అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి. ఇంకా అలాగే ఆలోచిస్తూ కూర్చుంటే మరో వారం, నెల.. ఇలా గడిచిపోతూనే ఉంటాయి. కరిగిపోవడం కాలం లక్షణం. కాలం కన్నా వేగంగా తరిగిపోవడం డబ్బుకున్న అవలక్షణం. పొదుపు మంత్రంతో దీన్ని సరిదిద్దొచ్చు. మదుపు తంత్రంతో ఈ అవగుణం తిరగబడకుండా చూసుకోవచ్చు. అలాగని ఏడాదిలోనే లక్షలు ఇన్వెస్ట్ చేసి కోట్లకు పడగలెత్తేలా పరుగులు తీయమని చెప్పటం కాదు. ఆదాయ, వ్యయాల చిట్టాలో చిట్టిపొట్టి సవరింపులతో గట్టి ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉంటాయి. గతేడాది చేసిన తప్పలను దిద్దుకుంటే ఈ నయా సాల్... నయా దౌర్‌కు నాంది పలుకుతుంది.*

ఆర్థిక వ్యవహారాలపైనే కుటుంబ జీవితం ఆధారపడి ఉంటుంది. నెల మొదలై పది రోజులు గడవకముందే చేబదులు కోసం స్నేహితుడికి మెసేజ్ చేస్తున్నారంటే.. మనీ మేనేజ్‌మెంట్‌లో మీరు ఫెయిల్ అవుతున్నారని అర్థం. మీ ఫోన్‌లో లోన్ యాప్‌లు ఉన్నాయంటే ప్రమాదానికి దగ్గరవుతున్నారని అర్థం. లోన్లు కావాలా అంటూ రెగ్యులర్‌గా కాల్స్ వస్తున్నాయంటే.. ఆర్థికంగా మీరు చతికిలపడ్డారని అర్థం చేసుకోవచ్చు. ఇవేం తీర్చిదిద్దుకోలేని తప్పిదాలు కావు. కాస్త అప్రమత్తంగా ఉంటే.. ఒక్కో సమస్యను నెగ్గుకురావొచ్చు.

**ఆదాయం ..వ్యయం**

ఆదాయానికి మించిన ఖర్చులు ఎప్పటికైనా ముంచేస్తాయి. అయితే ఆదాయం పెంచుకోవాలి. లేదా ఖర్చులు తగ్గించుకోవాలి. రాబడికి లోబడి వ్యయం ఉన్నంత కాలం సేఫ్ జోన్‌లో ఉన్నట్టే. వెచ్చాలు మొదలుకొని విహారాల వరకు ఖర్చు ఎక్కడ అదుపు తప్పుతుందో లెక్కలేసుకొని వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

**అప్పులు తీర్చడానికి అప్పొద్దు**

పరిమితికి లోబడి తీసుకునే అప్పు తప్పు కాదు. ఇంటి కోసం అప్పు మంచిదే! కూతురు పెండ్లి కోసం అప్పు చేయడమూ మన్నించదగినదే! అంతేకానీ, రుణభారం తగ్గించుకోవడానికి, వడ్డీ కింద వడ్డించడానికి అప్పు చేస్తున్నట్లయితే ఆ రుణం ఆజన్మాంతం వెంటాడే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఉన్నట్లయితే ఏదైనా నిరర్థకమైన ఆస్తిని అమ్మి అయినా.. అప్పుల ఊబి నుంచి బయటపడటం తెలివైన పని.

**కాపీలొద్దు బాసూ!**

సంపన్నులు కావడం వేరు, అలా కనిపించడం వేరు. స్థితిమంతులుగా ఎదగాలి అనుకోవడం మంచి లక్షణం. బంధువుల్లో గొప్ప అనిపించుకోవడం కోసం, కాలనీవాసుల పొగడ్తల కోసం లేనిపోని డాబులకు పోతే ఆర్థికంగా చతికిలపడటం ఖాయం. స్నేహితుడు కొత్త కారు కొన్నాడని.. స్థాయి లేకున్నా కారు కొనడం, బంధువు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌లో ఉంటున్నాడని.. ట్రిపుల్ బెడ్‌రూం ఇంట్లోకి మారడం ఇబ్బందులకు దారితీస్తుంది. కాపీ చేయడం మొదలుపెడితే.. జిందగీ కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటుంది. ఉన్నదాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. అందులోనే ఉన్నతంగా జీవించాలి.

**కీడెంచి మేలెంచు..**

సంపాదించే వ్యక్తులు దూరమైతే ఆ కుటుంబ పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుంది. కుటుంబసభ్యుల్లో ఎవరికైనా తీవ్రమైన జబ్బు చేసినా వైద్యానికయ్యే ఖర్చు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా పదేండ్లు వెనక్కి తోసేస్తుంది. ఇలాంటి సందర్భాలు తలెత్తినా ధైర్యంగా ఉండటానికి సరిపడా జీవిత బీమా, ఆరోగ్య బీమా తీసుకోవడం అనివార్యం అని గుర్తుంచుకోండి.

**కనీసం ఎనిమిదేండ్లు**

షేర్ మార్కెట్ ఎగాదిగా పెరిగిపోతున్నది.. ఈక్విటీ షేర్లతో ఏడాదిలో కరోడ్‌పతీ అయిపోతానంటే కుదరదు. ఈక్విటీ, షేర్ మార్కెట్ లాంగ్‌టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్! బంగారం, భూమి కూడా ఈ కోవకే వస్తాయి. కనీసం ఎనిమిదేండ్లు వేచిచూసే ఓపిక ఉంటేనే వీటిలో ఇన్వెస్ట్ చేయాలి.

ఫైనల్‌గా.. నెలంతా కష్టపడితే వచ్చిన డబ్బులను.. వారంలో ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయంటే మనీ మేనేజ్‌మెంట్‌లో వెనకబడినట్టే. రాబడి పెంచుకునే అవకాశం లేకపోతే.. ఖర్చు తగ్గించుకోవడం దినచర్యగా చేసుకోవాలి. వృథా ఖర్చులకు అడ్డుకట్ట వేయడం కూడా సంపాదించడం వంటిదే! 2025 క్యాలెండర్ గోడమీదికి ఎక్కేలోగా.. కొంతైనా మార్పు తీసుకురాగలిగితే ప్రతి ఏడాదీ పసందుగానే సాగిపోతుంది.■



**ఎం. రాం ప్రసాద్**
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్
ram@rpwealth.in
www.rpwealth.in



### ప్రణాళికతో..

ఖర్చులు ఎంత నియంత్రించుకున్నా ఒక్క ఏడాదిలో లక్షాధికారులుగా మారిపోరు. మీ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళిక బద్ధంగా పొదుపు, మదుపు చేయడం ద్వారా.. ఆయా అవసరాలు వచ్చినప్పుడు ఏ ఇబ్బందీ తలెత్తదు. అమ్మాయిని డాక్టర్ చదివించాలని అనుకుంటే సరిపోదు. పదిహేనేండ్ల తర్వాత ఎంబీబీఎస్ చదవడానికి ఖర్చు ఎంత ఉంటుందనే అంచనా వేసుకొని, అంత మొత్తం వచ్చేలా మ్యూచువల్ ఫండ్స్‌లోనో, ఈక్విటీలోనో ఇన్వెస్ట్ చేయాలి. ఆ లెక్కలేం మాకు తెలియవు అనుకుంటే.. ఏడాదికి కనీసం లక్ష రూపాయల చొప్పున పొదుపు చేయగలిగితే.. కూతురు ఎంబీబీఎస్‌కు వచ్చేసరికి కనీసం 20 లక్షలు చేతిలో ఉంటాయి. ఇలా ప్రణాళికతో సాగితే.. అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం రాదు.